సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం, 8, ఆగస్టు, 2024



ప్రతిభకు ప్రోత్సాహం

పేద విద్యార్థులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. ప్రతిభ గల వారిని ఎంపిక చేసి నాలుగేళ్లపాటు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తోంది. - 8లో



కృష్ణా జట్టు ఘనవిజయం

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు విజయం సాధించింది. - 8లో

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.2 - 29.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

11న వార్షికోత్సవం



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 11న ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, మంగళహారతి, గణపతి, రుద్ర, నవగ్రహ, చండీహోమాలు ఉంటాయని పేర్కొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా వజ్ర కిరీటం, వజ్రపు చీరెతో అలంకరిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వినియోగం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

పిల్లలంతా బడిలోనే ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని జయనగర్ కాలనీ హైస్కూల్లో మండల విద్యాశాఖ అధికారులకు, సమగ్రశిక్ష ఎంఐఎస్ కో-ఆర్డినేటర్‌లకు ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను డ్రాపౌట్ రహిత జిల్లాగా మార్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే యు డైస్ లో లోటుపాట్లను సవరించి ఖచ్చితమైన వివరాలను తయారు చేయాలన్నారు. నేడు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు దశరథరామిరెడ్డి, ఇలియాస్ ఖాన్, లక్ష్మి నరసింహరాజు, మిట్టా కేశవరెడ్డి, చల్లా విశ్వనాథరెడ్డి, రామాంజనేయరెడ్డి, రమణమూర్తి, డీఈఓ కార్యాలయ ఏఎస్ఓలు బ్రహ్మానంద రెడ్డి, జాలపతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



ఆచార్య పార్వతిని సత్కరిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి నూతన సంచాలకులుగా నియమితులైన ఆచార్య జి.పార్వతి బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య జి.పద్మల సమక్షంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, వైవీయూ ఆచార్యులు ఎంఎం వినోదిని, అనిత, పార్వతి, మునికుమారి, బ్రౌన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అభినందన

ఆచార్య జి.పార్వతిని వైఎస్సార్‌జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అభినందించారు. రచయితల సంఘం ప్రతినిధులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బండి.. ఇక రాదండి

కూలిపనులకెళ్లే వాళ్లకు ఇబ్బందే..



ఈమె పేరు షేక్ సుల్తాన్ బి. ఊరు వేంపల్లె. ప్రతినెలా రేషన్ బండే ఇంటిదగ్గరికొస్తే ఆనందంగా రేషన్ సరుకులు తీసుకునేది. ఇకపై బండి రాదనేసరికి దిగులు పడుతోంది. పనులకెళ్లే తాము రేషన్ షాపు వద్దే గంటల తరబడి వేచి ఉండాలంటే కుదురుతుందా... ఆ రోజుకు కూలి డబ్బులు పోయినట్టేనా! అంటూ దీనంగా ప్రశ్నిస్తోంది.



- ఇంటింటికి సరుకుల పంపిణీకి కూటమి ప్రభుత్వం చెల్లుచీటీ
- పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు అందించేలా సర్కార్ చర్యలు

సాక్షి ప్రతినిధి, కడప : చౌకదుకాణాల దరికి వెళ్లాల్సిన పనిలేదు. రేషన్‌షాపు డీలర్ల నిర్లక్ష్యం అసలే లేదు. తూకంలో మోసం, ఇవ్వాల్సిన సరుకుల కోత ఇలాంటివేవి లేకుండా ఇంటి వద్దకే గంట కొట్టి నిత్యావసర వస్తువులు అందించేవారు. ఇదీ నిన్నటి వరకూ ఉన్న మాట. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే సరుకుల పంపిణీకి అడ్డుకట్ట వేసింది. నిత్యావసర సరుకులు అందించే వాహనాలకు ఎన్డీయే కూటమి సర్కార్ మంగళం పలకనుంది. ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే వ్యవహారానికి స్వస్తి పలకాలని స్వయంగా సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇకపై రేషన్‌షాపు వద్దకు వెళ్లి సరుకులు తీసుకెళ్లేలా సన్నాహాలు చేపట్టడంపై ఇటు కార్డుదారుల్లో.. అటు వాహనదారుల్లో ఆందోళన మొదలైంది..

వైఎస్సార్ జిల్లాలో 5,49,744 రేషన్ కార్డులు, 36,608 అంత్యోదయ అన్న యోజన కార్డులు కలిపి మొత్తం 5,86,352 రేషన్‌కార్డులున్నాయి. వీరికి 1239 చౌకదుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. ప్రతి నెలా 8,361.8 టన్నులు బియ్యం, 164.8 టన్నులు చక్కెర అందజేస్తున్నారు. వీటిని చౌకదుకాణాల నుంచి నిత్యావసర వస్తువులు వినియోగదారులకు అందించేందుకు జిల్లాలో 366 సంచార పంపిణీ వాహనాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇంటివద్దకే రేషన్ సరుకులు వచ్చి చేరేవి. ఎలాంటి వివక్ష లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలందరికీ సగౌరవంగా నిత్యావసర వస్తువులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. సమయానుకూలంగా ఆయా సంచార వాహనాలల్లో పంపిణీ చేస్తూ వచ్చారు.

ఉపాధి కోల్పోనున్న యువత....

గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 366 మందికి వాహనాలు కేటాయించింది. 70:30 శాతం ప్రకారం రుణం చెల్లించేలా నిర్ణయిస్తూ రూ.6లక్షలు వాహనాన్ని అప్పగించింది. నెలకు రూ.18వేలు వేతనం అప్పగించి అందులో నుంచే బ్యాంకు లోన్ 6 ఏళ్ల లోపు చెల్లించేలా నిర్ణయించారు. కాగా సంచార పంపిణీ వాహనాలు తొలగించనున్నట్లు సూచన ప్రాయంగా సీఎం చంద్రబాబు వెల్లడించడంతో వాటినే నమ్ముకొని జీవిస్తోన్న యువత ఉపాధి కోల్పోతున్నామని ఆందోళన చెందుతున్నారు. తమకు ఉపాధితో పాటు పేదలకు ఇంటి వద్దకే సరుకులు అందించే భాగ్యం కూడా కోల్పోనున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి



ఇంటింటికి రేషన్ పథకాన్ని కొనసాగించాలి. 2019 కంటే ముందు రేషన్ కోసం రేషన్ షాపుల వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూ లైన్లలో నిలిచే వాళ్లం. సర్వర్ పని చేయకపోతే వెనక్కి వచ్చి మళ్లీ వెళ్లే వాళ్లం. రేషన్ షాపు కనీసం కిలోమీటరు దూరంలో ఉంటే నడిచి వెళ్లి రేషన్ తెచ్చుకునే సమయంలో వృద్ధులు, వికలాంగులు పడే బాధలు, కష్టాలు చూసిన జగనన్న ఇంటికే రేషన్ పంపించాడు. ఇపుడు వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేయాలని నిర్ణయించడం బాధాకరం. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని ఇంటింటికి రేషన్ పథకాన్ని కొనసాగించాలి.

– డి. సరోజ, అంధుల కాలనీ, కమలాపురం.

రేషన్ పంపిణీ వాహనాన్ని నిలిపివేయడం సరికాదు



ఇంటింటికి సరఫరా చేసే వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గం. రేషన్‌షాపులకు వెళ్లకుండానే గత ఐదేళ్లగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తున్నారు. ఇప్పుడు ఉన్నపలంగా ప్రభుత్వం నిలిపివేయడం సరైన పద్ధతి కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఉన్న పథకాలను రద్దు చేయడం చంద్రబాబుకు అలవాటే.

– పి.శైలజ, రాచాయపేట, గోపవరం మండలం

ఇంటి వద్దకు రేషన్ రాకపోతే ఇబ్బందులే



గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం ఇంటి వద్దకే వచ్చి అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో లబ్ధిదారులు రేషన్ షాప్ కి వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాలని చెప్పడం బాధ కలిగిస్తోంది. గత ప్రభుత్వం లాగానే ఇంటి వద్దకు రేషన్ బియ్యం అందించాలి.

– కొరివి లక్ష్మి, బుగ్గలేటిపల్లి, చింతకొమ్మదిన్నె మండలం

కష్టమవుతుందయ్యా..



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటింటికి రేషన్ పథకాన్ని రద్దుచేస్తున్నట్లు చెప్పడం సరికాదు. మాలాంటి వృద్ధులు రేషన్ షాపుకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలంటే చాలా కష్టమయ్యా. ఇంటివద్దకే రేషన్ పథకాన్ని కొనసాగిస్తే బాగుంటాది.

– ఆదిలక్ష్మి, లబ్ధిదారురాలు, పులివెందుల.

గండికి శ్రావణ శోభ



గండి వీరాంజనేయ స్వామి మూలవిరాట్

చక్రాయపేట : శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా గండిలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా అన్నిశాఖల అధికారులు సహకరించాలని కోరినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. తొలి రెండు శనివారాలు భక్తుల రద్దీ ఓ మోస్తరుగా ఉన్నా మిగిలిన రెండు వారాల్లో లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం,వీఐపీ దర్శనాలకోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పాపాఘ్ని నదిలో మహిళలు స్నానం చేసిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసతిని కల్పిస్తున్నట్లు వివరించారు. ఉత్సవాలకు టీటీడీ అధికారులు సహకారం అందించినట్లు ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు.

అభిషేకాలు ఉండవు

శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిలిపేసినట్లు ఆలయ ప్రధాన ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్, రాజ గోపాలాచార్యులు తెలిపారు.మూల విరాట్‌కు బదులుగా బాలాలయంలో ధారువ విగ్రహం ఉన్నందున ఈనిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.శ్రావణ మాసంలో స్వామి వారికి ఉదయం 3-30 నుంచి 4వరకు సుప్రభాతం,4 నుండి 5వరకు అలంకరణ ఉంటాయని వారు తెలిపారు.చివరి శనివారం ప్రత్యేక అలంకరణలో ఉన్న రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి క్షేత్రోత్సవం, అనంతరం పాపాఘ్ని నదిలో ఆస్థానం నిర్వహించి ఉత్సవాలను ముగిస్తామని వివరించారు.

ఆరుతడి పంటలకు వర్షం

- జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- బి.మఠంలో అత్యధికంగా 69.2 మి.మీ వర్షం



రాజుపాలెం: పత్తిపంటలో నిలిచిన వర్షం నీరు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలకు జీవం పోశాయి. వాడిపోతున్న పంటలను దున్నలేక.. నీరందించలేక నిరాశపడ్డ రైతు కళ్లల్లో మళ్లీ ఆశలు చిగురింపజేశాయి. ఈ సారి ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే తొలకరి పలకరించడంతో జిల్లాలో చాలామంది మెట్ట, నీటి ఆధారిత ప్రాంత రైతులు ఆరుతడి పంటలైన మినుము, పత్తి, వేరుశనగ, ఉల్లి, జొన్న, వేరుశనగ, పెసరలను 21071 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 4 వేల హెక్టార్లలో మినుము పంట, 2496 హెక్టార్లలో వేరుశనగ, 6362 హెక్టార్లలో పత్తి, 1101 హెక్టార్లలో మొక్కజొన్న పంటలను సాగు చేశారు. అయితే జులైలో అనుకున్న మేర వర్షాలు పడలేదు. దీంతో చాలా ప్రాంతాల్లో మినుము, వేరుశనగ, పత్తి, కంది, కొర్ర, సజ్జలు, పంటలు ఎండుముఖం పట్టాయి. తీవ్ర వర్షాభావంతో జిల్లాలో చాలా మంది మినుము రైతులు పంట ఎండు ముఖం పట్టడంతో దున్నేశారు. మరికొంతమంది దున్నేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షం ఆయా పంటలకు ఊపిరి పోసింది. ముఖ్యంగా కంది, పత్తి, ఉల్లి, జొన్నలతో పాటు ఆలస్యంగా సాగు చేసిన మినుము పంటలకు కాసింత ఊరట ఇచ్చినట్లయింది. కాగా ఇదివరకే వేలకు వేలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలను కళ్ల ముందే దున్నేయాల్సి రావడంతో చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు.

వరిపంటలకు ఎంతో మేలు...

జిల్లాలో ప్రస్తుతం సాగు చేసిన వరి పంటలకు కూడా ఈవర్షం చాలా మేలని రైతన్నలు తెలిపారు. ఈ వర్షం రాకతో మొక్కలు ఏపుగా పెరుగుతాయని పలువురు తెలిపారు. అలాగే పత్తి, వేరుశనగ, పెసరలకు అక్కడక్కడ చీడ, పీడలు ఆశించాయని ఈ వర్షం దెబ్బకు చీడపీడలు దూరమవుతాయని పలువురు రైతులు తెలిపారు. ఎండుముఖం పట్టిన మినుముకు ఈ వర్షం మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరావు అన్నారు.

వర్షపాతం వివరాలు ఇలా..

జిల్లాలో మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. ఇందులో అత్యధికంగా బి.మఠంలో 69.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే పోరుమామిళ్లలో 65.2, రాజుపాలెంలో 54.6, సీకేదిన్నెలో 52.4, బద్వేల్‌లో 48.4, కడపలో 45.4 , దువ్వూరులో 44.2, ఎర్రగుంట్లలో 44 , ఒంటిమిట్టలో 42.2 , ప్రొద్దుటూరులో 41, బి.కోడూరులో 39.6, అట్లూరులో 38.8, చక్రాయపేటలో 37, గోపవరంలో 34.6, జమ్మలమడుగులో 32.4 ,సిద్దవటంలో 30.2, చెన్నూరులో 29.8, చాపాడులో 26.2, తొండూరులో 24.6, మైదుకూరులో 23 , కమలాపురంలో 19.4, కాశినాయనలో 19.2, కలసపాడు 12.6, వీఎన్‌పల్లి 10.2, వల్లూరులో 9.2 ,సింహాద్రిపురంలో 8.6, లింగాలలో 6.4, పెండ్లి మర్రి 6.4 , వేముల 5.8 , కొండాపురంలో 3.2, పెద్దముడియం 2.8 , పులివెందుల్లో 2.4, వేముల 2 మి.మీ వర్షం కురిసింది.

చేనేత వస్త్రాలు.. సంస్కృతికి చిహ్నాలు

- ఉద్యోగులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించాలి
- జాతీయ చేనేత దినోత్సవ సభలో కలెక్టర్ శివ శంకర్ లోతేటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : చేనేత వస్త్రాలు మన సంస్కృతి సాంప్రదాయాలకు ఆనవాళ్లని ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించి చేనేత వర్గాలకు తోడ్పాటు అందించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీటింగ్ హాలులో జిల్లా చేనేత, జౌళీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో తయారయ్యే దూపియానా సిల్క్ వస్త్రం మాధవరంలో తయారయ్యే పట్టు చీరలకు మరింత ప్రచారం కల్పించి ప్రాధాన్యతను ఇస్తామన్నారు. కడప శిల్పారామంలో ప్రతి శని, ఆదివారాలలో చేనేత వస్త్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల 7వ తేదీ హ్యాండ్లూమ్స్ పై సమావేశం నిర్వహిస్తామని వివరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, చేనేత ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ మల్లికార్జున, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ లక్ష్మీ తులసి మాట్లాడారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. అనంతరం చేనేత కళాకారులను సన్మానించారు. అంతకుముందు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున 300 మందికి మూడు కోట్ల రూపాయలను చేనేత కళాకారులకు వీవర్స్ ముద్ర రుణ వితరణ మెగా చెక్కును కలెక్టర్ అందించారు.

నగరంలో ర్యాలీ .. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ స్టేట్ గెస్ట్ హౌస్ వద్ద ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. జిల్లా చేనేత,జౌళీ శాఖ అధికారి నాగరాజరావు, ఎల్‌డీఎం జనార్ధన్ రావు, జిల్లా సహకార అధికారి సుభాషిని, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి పాల్గొన్నారు.

శ్రావణం.. శుభప్రదం

- ప్రారంభమైన శ్రావణమాసం
- ప్రతి రోజూ ప్రత్యేకతే
- నెల రోజులూ పూజలు, వ్రతాలు



వరలక్ష్మివ్రతం చేస్తున్న మహిళలు (ఫైల్)



వివాహ ముహూర్తాలు

ఆగస్టు	: 8,9,10,11,14,15,16,17,18, 21,22,23,24,28,30
సెప్టెంబర్	: ముహూర్తాలేవు
అక్టోబర్	: 5,9,12,13,16,17,20,21,24,26,27
నవంబర్	: 3,4,6,7,8,11,13,16,17, 20,21,24,25,27
డిసెంబర్	: 4,5,6,7,9,10,11,14,16,19, 20, 22,24,25

కడప కల్చరల్,/రాజుపాళెం/మదనపల్లె సిటీ/రాయచోటి : శ్రావణం.. శుభప్రదం..ఈ మాసం ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ మాసం వస్తూనే పండుగలను తీసుకొస్తుంది. నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, పొలాల అమావాస్య తదితర పండుగలు ఈ మాసంలో వస్తాయి.

మార్కెట్‌లో సందడి

ఈ మాసంలో మార్కెట్‌లో సందడి నెలకొంటుంది. నూతన వస్త్రాలు, ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. జిల్లాలో ప్రధాన నగరాలైన మదనపల్లె, రాయచోటి, రాజంపేట పలు వస్త్రాల దుకాణాల్లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించి వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. పూలు,పండ్ల వ్యాపారులకు డిమాండ్ పెరగనుంది.

మోగిండి 'కల్యాణవీణ'

కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి.మామిడితోరణాలు కట్టిన వేదికలపై బంధుమిత్రుల కోలాహలం..బాజాభజంత్రీల ఘోష నడుమ..వేద మంత్రాల సాక్షిగా.. మూడుముళ్లు వేసుకుని..ఏడడుగులతో కొత్త జంటలు నవజీవనాన్ని ప్రారంభించనున్నాయి. మూడు నెలల విరామం తర్వాత ముహూర్తాలు ఉండటంతో ఆగస్టు 8 నుంచి మళ్లీ కల్యాణ బాజా మోగనుంది. తర్వాత దాదాపు ఒకటిన్నర నెలపాటు ముహూర్తాలు లేవు. తర్వాత మూడు నెలలపాటు అంతంత మాత్రపు ముహూర్తాలే ఉన్నాయి. అందుకే వీలైనంత వరకు ఆగస్టులోనే పెళ్లి బజాలు వినిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం వివాహ ముహూర్తాలకు చాలా రోజులు విరామం వచ్చింది. ఇప్పటికే మూడు నెలలపాటు పెళ్లిళ్లు లేవు. మార్చి 24న తర్వాత ఏప్రిల్, మే, జూన్, జులై మాసాల్లో వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ఎక్కడా పెళ్లి సందడి కనిపించలేదు. ఇన్ని రోజులపాటు వివాహాలు లేకపోవడంతో వీలైనంత త్వరగా తమ పిల్లలకు పెళ్లిళ్లు చేసేందుకు పెద్దలు హడావుడి పడుతున్నారు. అవసరమైన సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు. ఆగస్టు తర్వాత సెప్టెంబరులో ముహూర్తాలు అసలు లేవు. తర్వాత మూడు మాసాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఈనెల 8 నుంచి పెళ్లిళ్లు ప్రారంభమవుతుండగా, తర్వాత 12, 13, 19, 20 తేదీలు మినహా మిగతా రోజుల్లో ముహూర్తాలు ఉన్నాయి.

శ్రావణం..భక్తి మాసం



శ్రవణ నక్షత్రమే వెంకటేశ్వరస్వామి అవతార నక్షత్రం. ఈ మాసాన్ని మహిళలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. మంగళగౌరి, వరలక్ష్మి వ్రతాలతో అమ్మవారిని కొలుస్తారు. దీక్షలు చేస్తారు. రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు ఈనెలలో వస్తాయి. అందుకే శ్రావణమాసాన్ని భక్తిమాసంగా భావిస్తారు.

– సాయిచక్రవర్తి, వేదపండితులు, మదనపల్లె.

సకల శుభాలకు నెలవు..



శ్రావణ మాసంలో భక్తితో భగవంతుడిని ఆరాధిస్తే సకల శు భాలు వరిస్తాయి. పండుగలు, పర్వదినాలకు నోములు, వ్రతాలకు అనువైన మాసం. సిరిసంపదలు ప్రసాదించమంటూ మహాలక్ష్మిని కొలిచే శ్రావణంలో శివశక్తిని పూజిస్తారు. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం శ్రావణం.

– వీణా మాధవాచార్యులు, అర్చకుడు, వెల్లాల, రాజుపాళెం మండలం

ఖర్చయినా... తప్పదు కదా



అవసరాన్ని బట్టి డిమాండ్ పెరగడం మామూలే. పెళ్లి ఖర్చులకు సంబంధించి అన్నింటి ధరలు పెరిగాయి. అయినా వివాహాలను ఆపలేం కదా! అందుకే ఖర్చు చూసుకోకుండా అనుకున్న తేదీల్లోనే వివాహాలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకోక తప్పదు.

– చిల్లారి రెడ్డెయ్యరాజు, కడప



క్లుప్తంగా

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

కడప రూరల్ : ఎస్సీల భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలం రేకులకుంట పరిధిలో ఎస్సీ మహిళ మౌనికకు జీవనోపాధి కింద ప్రభుత్వం నాలుగు ఎకరాల భూమిని మంజూరు చేసిందన్నారు. ఈ భూమిలోకి మౌనికను అడుగు పెట్టకుండా బద్వేల్‌కు చెందిన అగ్రవర్ణాల వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు మౌనికతోపాటు ఆంజనేయులు, వెంకటరమణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుపై కొడవలితో దాడి

జమ్మలమడుగు : పెన్నానదిలో అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదు చేసిన ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పెన్నానది నుంచి అక్రమంగా దిగువపట్నం కాలనీకి చెందిన నానుబాల కిరణ్ ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నాడు. దీనిపై అదే గ్రామానికి చెందిన వెంకటనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆగ్రహావేశంతో ఊగిపోయిన కిరణ్ ఫిర్యాదు చేసిన వ్యక్తి నారాయణపై కొడవలితో దాడి చేశాడు. నారాయణకు తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాల వారు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం సీసాలు ధ్వంసం

బద్వేలు అర్బన్ : బద్వేల్ ఎస్ఈబీ, అర్బన్, రూరల్ స్టేషన్లలో పట్టుబడిన అక్రమ మద్యం సీసాలను ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాసులునాయుడు సమక్షంలో బుధవారం ధ్వంసం చేశారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణంలో శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు 83 కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా రవాణా చేసినా, నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతిభకు ప్రోత్సాహం

పేద విద్యార్థులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే ప్రతిభ గల వారిని ఎంపిక చేసి నాలుగేళ్లపాటు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తోంది.

- ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులకు వేళాయె
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రోత్సాహకాలు
- ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఈ ఏడాది డిసెంబరు 8న రాత పరీక్ష



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రతిభ గల పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక బరోసా కల్పించేందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అందజేస్తోంది. ఇందుకోసం ప్రతి ఏటా ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షలో ప్రతిభ చూపి ఎంపికై న విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. 9 వతరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యేంత వరకూ ఏటా ఈ ఆర్థిక ప్రోత్సాహం అందుతుంది. ఎక్కువ మంది ఈ పరీక్ష రాసేలా విద్యాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం..

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఎనిమిదో తరగతి విద్యార్థుల నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్ష రుసుము చెల్లించడానికి సెప్టెంబరు 10వ తేదీ వరకు గడువు ఉంటుంది. డిసెంబర్ 8న పరీక్ష నిర్వహిస్తారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.50 చొప్పున ఫీజు ఆన్‌లైన్‌లో సూచించిన ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

అర్హతలు తప్పనిసరి..

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రోత్సాహకాలకు అర్హులు. ఏడో తరగతిలో కనీసం 55శాతం మార్కులు, తుది ఎంపిక సమయం నాటికి 8వ తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం ఏడాదికి రూ. 3,50,000లకు మించకూడదు.

ప్రశ్నపత్రం విధానం ఇలా..

అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. 180 మార్కులతో మెంటల్ ఎబిలిటీ(మ్యాట్), స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్) ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు. తొలుత మ్యాట్ తొలి పేపర్‌లో మూడు విభాగాల నుంచి 90 ప్రశ్నలు అడుగుతారు. మెంటల్ ఎబిలిటీ నుంచి 45, ఇంగ్లిష్ ప్రొఫెషియన్సీలో 20, హిందీ ప్రొఫెషియన్సీలో 25 ప్రశ్నలు ఇస్తారు. అనంతరం శాట్ రెండో పేపర్‌లో మూడు విభాగాల నుంచి 90 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో సైన్స్‌లో 35, సోషియల్‌లో 35, మేథమేటిక్స్‌లో 20 ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తు గడువు వివరాలివీ..

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ : 05-08-24
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : 06-09-24
రుసుము చెల్లించడానికి చివరి తేదీ : 10-09-24
ఎన్ఎంఎంఎస్ రాత పరీక్ష : 08.12.2023

జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల వివరాలివీ..

మ్యానేజ్‌మెంట్	విద్యార్థుల సంఖ్య
ఎంపిపి, జెడ్పీ	10113
ప్రభుత్వ	667
మున్సిపల్	2002
ఎయిడెడ్	554
ఓరియంటల్	148
ఏపీ మెడల్	277

పేద విద్యార్థులకు చక్కటి అవకాశం



కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్ష పేద విద్యార్థులకు వరం. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివేందుకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలో ప్రతిభ చూపితే నాలుగేళ్లపాటు ఆర్థిక వెసులబాటు కలుగుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

\- మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

గండి ఆంజనేయస్వామి మాన్యం గుర్తింపు

చక్రాయపేట : ఖాజీపేట మండలంలో ఆక్రమణకు గురైన గండి ఆంజనేయ స్వామి మాన్యం 21 సెంట్లను తాజాగా అధికారులు గుర్తించారు. మండలంలోని చెన్నముక్కపల్లె పంచాయతీలోని సర్వే నెంబర్ 192-3లో 21 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని ఎవరికీ తెలియకుండా కొందరు ఆక్రమించి సాగు చేస్తున్నారు. ఆలయానికి రూపాయి కూడా చెల్లించలేదు. అయితే ఇటీవల ఈ భూమి ఆలయ మాన్యం అని తెలియడంతో అధికారులు స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఇంటర్ విద్యతో ఉద్యోగాలు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ విద్యతో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కొలువులు లభించనున్నాయని ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య అన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన అన్ని గ్రూపుల (మ్యాథ్స్ మినహా) విద్యార్థులకు ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బి ఆధ్వర్యంలో ఈ నెల 10న కడప ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. తొలుత క్యాట్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ఉంటాయని, తరువాత ఇంగ్లీష్ వర్సెంట్ పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు శిక్షణా కాలంలో స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ ఉద్యోగ మేళా వినియోగించుకోవాలని తెలిపారు.

ఏటీఎంలో నగదు చోరీ యత్నం

సకాలంలో స్పందించిన బ్యాంకు సిబ్బంది, పోలీసులు

ఖాజీపేట : ఖాజీపేట పోలీస్ స్టేషన్ సమీపంలోని ఏటీఎంలో నగదు చోరీ యత్నం విఫలమైంది. పోలీసులు, బ్యాంకు సిబ్బంది సకాలంలో స్పందించడంతో నగదు చోరీ కాకుండా కాపాడగలిగారు. పోలీసులు, బ్యాంకు సిబ్బంది వివరాల మేరకు.. ఖాజీపేట పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్‌బీఐ బ్యాంక్, ఏటీఎం ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు ఏటీఎం లోపలికి ప్రవేశించాడు. తాను కనిపించకుండా సీసీ కెమెరాలకు పసుపు రంగు స్టిక్కర్ అతికించారు. అనంతరం ఎటీయం మిషన్ ఉన్న పెట్టెను ఓపెన్ చేశాడు. లాకర్ తెరచే ప్రయత్నం చేయడంతో పెద్ద సైరన్ మోగింది. దీంతో దొంగ పలాయనం చిత్తగించాడు. విషయం మంగళగిరిలోని ఎటీఎం మిషన్ కంట్రోల్ నిర్వాహకులు గుర్తించి ఎస్‌బీఐ ఆర్ఎం కిషోర్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన ఖాజీపేట బ్యాంకు సిబ్బందికి ఫోన్‌లో తెలిపారు. ఏటీఎం ఎదురుగా ఉన్న దుకాణం యజమానికి సిబ్బంది ఫోన్ చేశారు. దొంగ ఎటీఎంలో ఉండి చోరీ యత్నం చేస్తున్నట్లు గుర్తించి అతను గట్టిగా కేకలు వేయడం, పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగిపోయింది. పోలీసులు చేరుకునే లోగా దొంగ పరారయ్యాడు. చోరీ చేసేందుకు తీసుకువచ్చిన సంచి, కొన్ని వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఖాజీపేట మండలంలో ఐదు బ్యాంకులున్నాయి. ఒక్క బ్యాంకు వద్ద సెక్యూరిటీని ఎర్పాటుచేసుకోలేదు. బ్యాంకు అధికారులు స్పందించి రాత్రివేళ సెక్యూరిటీని నియమించాల్సిన అవసరం ఉంది. పట్టణంలో చోరీల సంఖ్య పెరిగిందని, బస్టాండ్ కూడలి, బీసీకాలనీ, అగ్రహారం సమీపంలోని కూడళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఏటీయం మిషన్‌లో పరిశీలిస్తున్న క్లూస్ టీం

డీఎస్పీ, క్లూస్ టీం పరిశీలన

ఏటీఎం చోరీయత్నం తీరును మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు పరిశీలించారు. క్లూస్ టీ సిబ్బంది వేలి ముద్రలను తీసుకున్నారు. ఖాజీపేటలో నిఘా ఉంచుతున్నామని, రాత్రి వేళగస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సైనిక్ స్కూలును త్వరగా ఏర్పాటు చేయండి

డిఫెన్స్ సెక్రటరీకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వినతి

కడప కల్చరల్ : నల్లపురెడ్డిపల్లెలో మంజూరైన సైనిక్ స్కూల్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భారత ప్రభుత్వ డిఫెన్స్ సెక్రటరీ గిరిధర్ ఆరామణిని కోరారు. ఢిల్లీలో బుధవారి ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. దేశంలో కొత్తగా 23 సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించడం సంతోషదాయకమన్నారు. అందులో వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు కూడా మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలోనే సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



భారత ప్రభుత్వ డిఫెన్స్ సెక్రటరీ గిరిధర్ ఆరామణికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అంతర్జాతీయ వాలీబాల్ టోర్నీకి నరసింహారావు

కాశినాయన : కాశినాయన మండలంలోని నాయునిపల్లె గ్రామానికి చెందిన తలారినరసింహులు, జయమ్మల కుమారుడు తలారినరసింహారావు అంతర్జాతీయ సింగిల్స్ వాల్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన నరసింహారావు ఇంటర్ వరకు సగిలేరు గురుకుల పాఠశాలలో చదివాడు. ప్రస్తుతం పోరుమామిళ్ళలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. నరసింహారావుకు చిన్నప్పటి నుండే ఆటలపై మక్కువ ఉండేది. ఈ నేపథ్యంలోనే విజయవాడలో జరిగిన అండర్-18 స్టేట్ వాల్‌బాల్ పోటీలలో వైఎస్సార్ జిల్లా తరపున సింగిల్స్ ఆడి గోల్డ్‌మెడల్ సాధించాడు. తర్వాత రాష్ట్ర జట్టుకు ఎంపికై రాజస్థాన్‌లో జరిగిన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. ప్రస్తుతం నేపాల్ రాజధాని ఖాట్మండులో ఈ నెల 25న జరగనున్న అంతర్జాతీయ పోటీలకు భారత జట్టు తరపున ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పోరుమామిళ్ళ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి నరసింహారావు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిని బుధవారి కలిశారు. ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



నరసింహారావును అభినందిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

తిరుపతి చుట్టుపక్కల మరియు పరిసర ప్రాంతాలలో మీ ప్రాపర్టీ (ప్లాట్స్/ఇల్లు) మంచి ధరకు కొనుగోలు చేస్తాము. వెంటనే సంప్రదించండి సెల్: 70138 93537.

SERIVCES

వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీలో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342

CHANGE OF NAME

I, RAJAMGARI VENGAIAH S/O PENCHALAIAH, R/O. 7/178-B, YEGUVA (ST), VELAGACHARLA, PENAGALUR (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY DAUGHTER NAME AS FROM RAJANGARI PAVITRA (OLD NAME), OLD AADHAR NO. 624867371153 TO RAJAMGARI PAVITHRA (NEW NAME) NEW AADHAR NO. 410972586494.

I, PATAN NAZMA W/o NOORUMBHAI ISMAIL BASHA, 2-99 CHINNAREDDYPALLI(VI), KAMALAPURAM(MDL), KADAPA DIST, A.P. NOW I CHANGE MY DAUGHTER'S SURNAME AS (NEW) SHAIK (OLD) NOORUMBHAI SHAIK

I, Shaik Asma (Old Name) D.No.43/114-5-2-1, Prakash Nagar, Yerramukapalli, Kadapa, YSR dist, A.P. Here change my name as Syed Asma (New Name) W/o Syed Amzad Basha. Henceforth I may be called as Syed Asma.

CHANGE OF SURNAME

I, Syed Abdul S/o Syed Athavulla (Old Name), R/o 14/357, Dastagiripeta, Proddatur-516360, YSR Dist, A.P., have changed my surname as Shaik Abdul s/o Syed athavulla (New Name) for all purposes.

CHANGE OF NAME AND SURNAME

I, Syed Mahaboobba W/o Syed Abdul (Old Name), R/o 14/357, Dastagiripeta, Proddatur-516360, YSR Dist, A.P., have changed my given name and surname as Shaik Mahabooba W/o Shaik Abdul (New Name) for all purposes.

I, Mehbuba Syed Abdul W/o Syed Abdul (Old Name), R/o 14/357, Dastagiripeta, Proddatur-516360, YSR Dist, A.P., have changed my given name and surname as shaik Mahabooba W/o Shaik Abdul (New Name) for all purposes.

పాస్‌పోర్ట్ పోయినది

పాస్‌పోర్ట్ No. V0875948, Palaka Satish Kumar S/o Palaka Venkatesu, D.No.44/37-223 Bhagath Singh Nagar, Chemmumiahpeta, Kadapa, YSR District, పై వివరాలు గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికిన వారు దయచేసి సంప్రదించండి. 8888099291

I, Nagularu Praveen Kumar, S/o Nagalaru Pattam Guruswamy, resident of D.No.4/12-3, Kagithalapenta, Kadapa City, YSR Kadapa District, have lost my original passport (Passport No. W5496700) on 31.07.2024 while traveling in an auto from ITI Circle to RTO Office Circle. If anyone finds it, please contact me at 8179305003

WANTED

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9848866206,8579638520.

ప్రముఖ స్కూల్ నందు పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. పురుషులు-2, స్త్రీలు-2 అర్హతను బట్టి మంచి వేతనము, వసతి కల్పించబడును. సంప్ర : 7569489905, 9966261571

కడప పట్టణంలో ప్రముఖ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు 3 to 5th ఇంగ్లీష్ (జీతం : 15K.) 3 to 5th E.V.S (జీతం : 15K.) 3 to 5th Hindi (Up to 15k), 8 to 10th బయాలజీ , (Up to 30K) 6 to 9th NEET ఫౌండేషన్ బయాలజీ (Up to 30K) బోధించుటకు అర్హత అనుభవం కలిగిన టీచర్లు కావలెను. Cont : 9059004664, 9292607689

ప్రముఖ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పనిచేయుటకు లీడర్స్ కావలెను. (ఏజంట్స్‌తో పని చేయించవలెను). అనుభవం : (1 to 3 సంవత్సరాలు) వ్యక్తులకు మొదటి ప్రాధాన్యత. సంప్ర : 8519824539

PAPARAO HIGH SCHOOL, K.UPPALA PADU, near Tangutur, Prakasam (Dt.) Wanted Hindi, Science, Social Teachers to Teach Primary (Ladies) & High School Classes (E.M). Salary Negotiable Free Boarding, Lodging Cont. ✆ 7019326579, 8008622210

కస్టమర్స్ రాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను జీ:15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph: 8317512135

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపనికి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

డిప్యూటీ డీఎంహెచ్ఓపై చర్యలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు బానోతు చిన్నమ్మను మోసం చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ చెన్నకృష్ణపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. బాధితురాలితో కలిసి స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ డాక్టర్ చెన్నకృష్ణ 13 ఏళ్ల కిందట నర్సుగా చేరిన బంజారా మహిళ చిన్నమ్మను పెళ్లి చేసుకొని, ఇపుడు విచక్షణ రహితంగా దాడిచేసి గాయపరచడమేగాక, చంపుతామని బెదిరించారన్నారు. ఈ సంఘటనలో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. డాక్టర్ చెన్నకృష్ణతోపాటు, అతడి మొదటి భార్య సుజాత, ఆయన కుమారుడు డాక్టర్ తేజదీప్‌వర్మలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బానోతు చిన్నమ్మకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి, మల్లికార్జున, జగన్‌నాయక్, అంకుశం పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

కడప సెవెన్‌రోడ్స్ : బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు జంగం రాజేంద్ర ప్రసాద్ సూచించారు. కలెక్టర్‌లోని బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు తీరు అంశంపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపళ్లు పిల్లలపట్ల సున్నితత్వంతో మెలగాలని సూచించారు. ఎక్కడైనా పిల్లల సమస్యలు గుర్తిస్తే వెంటనే జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి తెలియజేయాలన్నారు. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్తగా బాలల కోసం చట్టాలను రూపొందిస్తూ అమలు చేస్తున్నాయన్నారు. సంరక్షణ కేంద్రాల్లో బాలలను సొంత బిడ్డల్లా చూడాలన్నారు. చట్టంతో విభేదించే పిల్లలను బాలల న్యాయ మండలిలో హాజరుపరచాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పిల్లల సమస్యల కొరకు 1098, మహిళల సమస్యల కొరకు 181 టోల్ ఫ్రీ నంబర్లు ఉన్నాయన్నారు. బాలల సంక్షేమ సమితి చైర్మన్ సాంబశివరావు మాట్లాడుతూ బాలల రక్షణ, సంరక్షణ కోసం పని చేస్తున్నప్పుడు దయా హృదయంతో కాకుండా సానుభూతితోతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సుభాష్, బాలల సంక్షేమ సమితి చైర్మన్ సాంబశివరావు, డీఈఓ అనురాధ, సోషల్ వెల్ఫేర్ జేడీ సరస్వతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, లోకేశ్వర్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జట్టు ఘనవిజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు విజయం సాధించగా, నెల్లూరు-కడప, చిత్తూరు-పశ్చిమగోదావరి మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 122 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 57.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 179 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులో నిఖిల్ 62, ధనుష్ 56 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 36.5 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో థామస్ రామ్ 39, రోహిత్ కుమార్ 33 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్ రాజేష్ 7 వికెట్లు తీశాడు. దీంతో కృష్ణా జట్టు 122 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 219 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 137 పరుగులు చేసింది.

నెల్లూరు, కడప మ్యాచ్ డ్రా..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 334 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 98 ఓవర్లలో 415 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మన్విత్‌రెడ్డి 193 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 42 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. జట్టులోని గురుచరణ్ 45, సాయిచేతన్ 54 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ మోహన్ 2, భార్గవ్ మహేష్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 347 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

చిత్తూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 76 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 62 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. జట్టులోని మహబూబ్ 51, వినయ్ 81 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్ బాలాజీ 4 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతి చెందిన ఓబుళమ్మ

మైదుకూరు : విద్యుదాఘాతంతో ఓ మహిళా రైతు మృతి చెందిన సంఘటన బుధవారం మైదుకూరు మండలం లింగాలదిన్నె గ్రామంలో జరిగింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. లింగాలదిన్నె గ్రామానికి చెందిన ధనికెల కృష్ణయ్య, ఓబుళమ్మ తమ పొలంలో ఉల్లి పంట సాగు చేశారు. బుధవారం మధ్యాహ్నం భార్యా, భర్తలు పొలంవద్దకు వెళ్లారు. ముందుగా కృష్ణయ్య పొలానికి చేరుకోగా.. వెనకే వస్తున్న ఓబుళమ్మ పక్క పొలంలోని మోటారుకు అమర్చిన స్టార్టర్ వద్ద వస్తుండగా ప్రమాదవశాత్తూ తీగ తగిలింది. విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు.

9న కార్పొరేట్స్ క్విట్ ఇండియా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఈ నెల 9న కార్పొరేట్స్ క్విట్ ఇండియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి తెలిపారు. నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1942 ఆగస్టు, 9న ఆనాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు దేశం విడిచి వెళ్లిపోవాలని క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో వ్యవసాయాన్ని, కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇది వికసిత్ భారత్ కాదని, అన్నదాతల ఆత్మహత్యలు, అప్పుల భారతదేశం అని ఎద్దేవా చేశారు.ఈ సమావేశంలో బాదుల్లా, చంద్రారెడ్డి, మద్దిలేటి, లింగన్న, గోపాలకష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాపాడాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆదివాసీల హక్కులను ప్రభుత్వాలు కాపాడాలని విరసం నాయకురాలు వరలక్ష్మి, పౌరహక్కుల సంఘం నాయకుడు సురేష్, కథా రచయిత దాదాహత్, కవి మహమూద్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు పద్మ డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరులో ఆదివాసీ హక్కులు - కార్పొరేటీకరణ - సంఘీభావ ఉద్యమాలు అఖిల భారత సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆదివాసీలు తమ అస్తిత్వం కోసం, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి జీవన్మరణ ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. హెదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 9, 10 వ తేదీల్లో నిర్వహించే సదస్సులో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాలికపై అత్యాచారం

కడప అర్బన్: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థినిని (17), మహేష్ అనే యువకుడు కిడ్నాప్ చేసుకుని వెళ్లాడు. సెవెన్ రోడ్స్ సమీపంలోని ఓ లాడ్జికి తీసుకుని వెళ్లాడు. అక్కడ గదిలో వుండగానే విద్యార్థిని అన్న గమనించాడు. వెంటనే పోలీసులకు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు వెళ్లగానే యువకుడు పరారయ్యాడు. బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన నేరానికిగాను పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సురక్షితంగా గమ్యాన్ని చేరండి



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు




వీల్ ఛెయిర్‌ను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి
- 1700 హెల్మెట్‌లు, 50 వీల్ ఛెయిర్ల పంపిణీ


కడప అర్బన్ : ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌ను ధరించి సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి తెలిపారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జి. శ్రీదేవి మాట్లాడుతూ అతివేగం ప్రాణానికి ముప్పు అని గ్రహించాలన్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు ఇంటి వద్ద ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలన్నారు. ఎస్పీ వి. హర్ష వర్ధన్ రాజు మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్‌ల ప్రాధాన్యం గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో హెల్మెట్ ధరించకపోతే జరిమానా, శిక్ష తప్పవన్నారు. అనంతరం వివిధ ఫ్యాక్టరీల యాజమాన్యాల సౌజన్యంతో 1700 హెల్మెట్లు, విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. వివిధ కోర్టులకు హాజరయ్యే దివ్యాంగులు, వృద్ధుల కోసం 50 వీల్ ఛెయిర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.దీనబాబు, షేక్ ఇంతియాజ్ అహ్మద్, ఎస్.ప్రవీణ్‌కుమార్, కె. ప్రత్యూష కుమారి, జడ్జి జె.హేమప్రవంతి, జె.నందిని, కె.భార్గవి, విజయలక్ష్మి, డీటీసీ మీరా ప్రసాద్, డిజేబుల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్, జిల్లా అధికారులు, బొగ్గుల గుర్రప్పనాయుడు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంస్థల ప్రతినిధులకు సన్మానం: డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి కృషితో 1700 హెల్మెట్‌లను, 50 వీల్ ఛెయిర్లు పంపిణీ చేసేందుకు సహకరించిన ఆదిత్యాబిర్లా, భారతి సిమెంట్స్, ఇండియా సిమెంట్స్, దాల్మియా సిమెంట్స్, హెచ్‌సీఎల్, జువారీ సిమెంట్స్, సంయు గాజు, శతాబ్దపు ప్యానెల్స్, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్, ఆర్‌టిపిపి, ఆల్ డిక్సన్ ప్రతినిధులను న్యాయమూర్తులు, జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు.


మండల విద్యాశాఖ అధికారుల సంఘం నూతన కార్యవర్గం



చిట్టిబాబు



సునీల్‌కుమార్



ఎంఈఓ-2 అసోసియేషన్ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారి-2 సంఘం నూతన కార్యక్రమం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కడప నగరంలోని జయనగర్ కాలనీ జడ్పీ పాఠశాలలో జరిగిన మండల విద్యాశాఖ అధికారి-2ల సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా బత్తిని చిట్టిబాబు(మైలవరం) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మూరదోటి సునీల్‌కుమార్ (బి.కోడూరు), గౌరవాధ్యక్షులుగా రఘురాములు (గోపవరం), ఉపాధ్యక్షుడిగా ప్రమీల (బద్వేల్), రాష్ట్ర కౌన్సిలర్లుగా వంశీకృష్ణ (చాపాడు), గంగాధర్ నాయక్ (పెండ్లిమర్రి), మహిళా కార్యదర్శులుగా జీవీ.సుభాషిణి (కమలాపురం), నిర్మల (కాశినాయన), కోశాధికారిగా సత్యనాగరాజు (ఖాజీపేట)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జీవో 89 ప్రకారం గత ఏడాది జూన్‌లో రాష్ట్ర విద్యా శాఖ ఎంఈఓ-2 నియామకాలు జరిగాయన్నారు. ఎంఈవోల సమస్యలను పరిష్కరించేందుకు కడప జిల్లా శాఖ పక్షంగా రాష్ట్ర సంఘం సాయంతో పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2లు పాల్గొన్నారు.